# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- దివ్యాంగులు సులువుగా ఓటు వేసేందుకు, వారికి పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సక్షం యాప్ ను ప్రారంభించింది.
- క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు రాష్ట్ర టీబీ నివారణ అధికారి డాక్టర్ టి.రమేష్ తెలిపారు.
- ఆపరేషన్ సంకల్ప్ పేరుతో భారత నౌకాదళం హిందూ మహా సముద్రంలో చేపట్టిన భద్రతా కార్యకలాపాలు విజయవంతమయ్యాయని భారత నౌకాదళం వెల్లడించింది.
- రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల వేడి, తేమతో కూడిన వాతావరణం ఏర్పడవచ్చని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలియజేసింది.

============================

అర్హులైన వారు తమ ఓట హక్కు వినియోగించుకోలేని పరిస్థితి ఉండకూడదన్న లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం అనేక చర్యలను తీసుకుంటోంది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే అన్ని అవకాశాలపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఇందులో భాగంగా 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, 40 శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేయవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది. దివ్యాంగులకు సులువుగా ఓటు వేసేందుకు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ఎన్నికల సంఘం “సక్షం” యాప్ ను ప్రారంభించింది. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వాలంటీర్లు, వీల్ చైర్లు అందుబాటులో ఉంచడంతో పాటుగా... దివ్యాంగులు, వృద్ధులకు రవాణా సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తోంది.

============================

క్షయ వ్యాధిని 2025 సంవత్సరం నాటికి పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని రాష్ట్ర టీ.బీ. నివారణ అధికారి డాక్టర్ టి.రమేష్ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఓల్డ్ జీజీహెచ్ వద్ద ఈరోజు నిర్వహించిన ర్యాలీలో

ఆయన పాల్గొని మాట్లాడుతూ, జాతీయ క్షయ నివారణ కార్యక్రమం (ఎన్‌టీఈపీ) కింద పటిష్ట కార్యాచరణతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ టీ.బీ. కేసుల్లో దాదాపు 24 శాతం భారత్‌లో నమోదవుతున్నాయని, మరణాల సంఖ్య కూడా అధికంగానే ఉంటోందని వివరించారు. క్షయ కేసులను గుర్తించేందుకు రాష్ట్రంలో 720 ట్రూనాట్, 50 సీబీనాట్ సెంటర్ల ద్వారా ఏటా 10 లక్షలకు పైగా పరీక్షలు నిర్వహిస్తున్నామని, "అడల్ట్ బీసీజీ" వ్యాక్సినేషన్ అనే కొత్త కార్యక్రమాన్ని ఈ ఏడాది చేపడుతున్నామని చెప్పారు. ఈ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిస్తూ....

(వాయిస్ 25 సెకన్లు)

============================

"ఆపరేషన్ సంకల్ప్" పేరుతో భారత నౌకాదళం హిందు మహా సముద్రంలో సముద్ర భద్రతా కార్యకలాపాలను చేపట్టి 100 రోజులు పూర్తయింది. ఈ సమయంలో భారత నావికాదళం 18 సంఘటనలకు ప్రతిస్పందించి ఫస్ట్ రెస్పాండర్ పాత్రను విజయవంతంగా పోషించిందని భారత నౌకాదళం వర్గాలు వెల్లడించాయి. గల్ఫ్ ఆఫ్ ఏడెన్, అరేబియా సముద్రం, సోమాలియా తూర్పు ప్రాంతాల్లో భారత నౌకాదళం ఈ భద్రతా కార్యకలాపాలను నిర్వహించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రాంతంలో అనేక ముప్పుల కారణంగా తలెత్తిన భద్రతా పరమైన సవాళ్ళకు ప్రతిస్పందించడంలో భారత నౌకాదళం ముందంజలో ఉందని తెలియజేశాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఫస్ట్ రెస్పాండర్ అండ్ ప్రిఫరెన్స్ సెక్యూరిటీ పార్టనర్ గా భారత నావికాదళం కీలక పాత్ర పోషించిందని నేవీ వర్గాలు పేర్కొన్నాయి.

============================

రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల్లో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల వేడి, తేమతో కూడిన వాతావరణం ఏర్పడవచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది.

============================

సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎస్.వీ.ఎన్ బట్టి ఈరోజు కృష్ణా జిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన ఆయనకు దేవాదాయ శాఖ అధికారులు, వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

విరామం

============================

తిరుమల క్షేత్రంలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగవ రోజైన ఈరోజు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు తెప్పపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారు ఆశీనులై పుష్కరిణిలో ఐదు మార్లు విహరించారు. కాగా నేటి సాయంత్రంతో తెప్పోత్సవాలు ముగిశాయి.

============================

ఉల్లి ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. గతేడాది డిసెంబరులో ఉల్లి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే... దేశీయంగా ఉల్లి లభ్యతను పెంచడానికి, ఉల్లి ధరలను అదుపులో ఉంచడానికి తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఉల్లి ఎగుమతులపై నిషేధం కొనసాగనున్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (DGFT) ఒక ప్రకటనలో తెలియజేసింది.

==============================

విశాఖ జిల్లాలో క్షయ మహమ్మారిని శాశ్వతంగా నిర్మూలించేందుకు జిల్లా యంత్రాంగం, వైద్యులు, నిక్షయ మిత్రలు, పారిశ్రామిక వేత్తలు కలిసికట్టుగా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ, క్షయ నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు విశాఖలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్షయ స్వల్పకాలిక వ్యాధి అనీ, క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తగిన వ్యాయామం చేయడం ద్వారా నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అవగాహనా ర్యాలీని ప్రారంభించారు.

==============================

కేంద్ర సాయుధ బలగాలు తిరుపతి జిల్లాలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈరోజు కవాతు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉదయం తిరుపతి నగరంలో ఓటర్లను చైతన్య పరచడమే కాక వారికి ధైర్యం కలిగించడానికి కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి సర్కిల్ నుంచి వైకుంఠంపురం ఆర్చ్, గాంధీపురంల మీదుగా కవాతు జరిగింది. ఈ సందర్భంగా డీఐజీ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఓటర్లకు భరోసా కల్పించే ఉద్దేశ్యంతో ఈ కవాతు నిర్వహించినట్టు తెలిపారు.

==============================

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. రేపు మధ్యాహ్నం ఆయన బెంగళూరు నుంచి కుప్పంకు చేరుకుని, అక్కడి పార్టీ కార్యకర్తలతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. అలాగే సాయంత్రం కుప్పం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. రెండు రోజుల పర్యటన అనంతరం ఆయన బెంగుళూరు చేరుకని అక్కడి నుండి విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారని పేర్కొన్నాయి.

==============================

క్షయ వ్యాధి గ్రస్తులకు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాలలో భాగంగా పార్వతీపురంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడే మందులను ఉచితంగా అందిస్తున్నామని, దీర్ఘకాలం ఉండే మొండి క్షయకు ప్రభుత్వం 21 నెలల పాటు 2 లక్షల రూపాయల విలువైన మందులను ఉచితంగా అందజేస్తోందని వివరించారు.

==============================

వేసవికాలం నేపథ్యంలో ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర ఒక లేఖ రాస్తూ... వేసవి సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు తీవ్ర పరిణామాలకు

దారితీస్తాయని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో వీటిని అరికట్టేందుకు ఆరోగ్య శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు కలిసి పని చేయాలని కోరారు. ఆసుపత్రుల్లోని అగ్నిమాపక యంత్రాలు, పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.

============================

క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. శ్రీహరి పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈరోజు తిరుపతిలోని రుయా ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు.

============================

============================